# నమస్తే ఉదయం

తెలుగు దినపత్రిక

రంగారెడ్డి | సంపుటి : 01 | సంచిక: 360 | పేజీలు: 4 | వెల: 4/- | సోమవారం ● 15, జూలై 2024 | ఎడిటర్: ఎం.వనితా రెడ్డి


## హిజ్రాల ఆగడాలు అడ్డుకోవాలని డీజీపీకి ఫిర్యాదు

హైదరాబాద్,జూలై 14 (నమస్తే ఉదయం): పెళ్లిళ్లు,గృహ ప్రవేశం,షాపు ఓపెనింగ్ సహా ఏ ఫంక్షన్ చేసుకోవాలన్నా హిజ్రాల ఆగడాలు మితిమీరుతున్నాయని డీజీపీకి ఓ వ్యక్తి ఫిర్యాదు చేశారు.'ఈ సమస్య చాలా పెద్ద మొత్తంలో ఉంది. ఫంక్షన్లు చేసుకునే వారికి పోలీసులు భరోసా



ఇవ్వండి. లేదంటే వారు భయపెట్టి మరీ డబ్బులు వసూలు చేస్తున్నారు' అని రాచకొండ,సైబరాబాద్,హైదరాబాద్ సిపిలను ఆయన ట్యాగ్ చేశారు.గతంలో హిజ్రాలకు పోలీసులు వార్నింగ్ ఇచ్చిన వీడియోను పంచుకున్నారు.





## అంగరంగ వైభవంగా ప్రజాభవన్‌లో బోనాలు

- ఉత్సవాలకు హాజరైన సీఎం, మంత్రులు, ఎంపీ, ఎమ్మెల్యేలు
- బోనమెత్తిన మంత్రి సురేఖ, డిప్యూటీ సీఎం సతీమణి, మహిళా ఎమ్మెల్యేలు
- సీఎం రేవంత్ రెడ్డికి ఘనంగా స్వాగతం పలికిన డిప్యూటీ సీఎం
- నల్ల పోచమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు
- కళా విన్యాసాల నడుమ కనుల పండుగగా బోనాల ఊరేగింపు

హైదరాబాద్, జూలై14(నమస్తే ఉదయం): డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు సతీమణి నందిని ప్రజాభవన్ లో ఈరోజు నల్ల పోచమ్మ అమ్మవారికి నిర్వహించిన బోనాల ఉత్సవాలు అంగరంగ వైభవంగా జరిగాయి. ఈ బోనాల ఉత్సవాలకు ముఖ్యఅతిథిగా రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, విశిష్ట అతిథులుగా రాష్ట్ర మంత్రులు కొండా సురేఖ, దుద్దిళ్ల శ్రీధర్ బాబు, పొన్నం ప్రభాకర్, ప్రభుత్వ సలహాదారు వేంరెడ్డి నరేందర్ రెడ్డి లు హాజరయ్యారు. బోనాల ఉత్సవాల్లో పాల్గొనడానికి ప్రజాభవాన్ కి విచ్చేసిన సీఎం రేవంత్ రెడ్డికి, రాష్ట్ర మంత్రులకు భట్టి విక్రమార్క దంపతులు పుష్ప గుచ్ఛాలు అందించి ఘనంగా స్వాగతం పలికారు.

ఆలయ పండితులు బోనాలకు, మహంకాళి అమ్మవారి ఘటానికి ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం మంత్రి కొండ సురేఖ, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క సతీమణి నందిని, ఎమ్మెల్యే ఎన్ ఉత్తం పద్మావతి, తదితర మహిళ ప్రజా ప్రతినిధులు బోనం ఎత్తుకోగా సీఎం రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కలు మహంకాళి అమ్మవారి ఘటాన్ని ఇంట్లో నుంచి బయటకు తీసుకువచ్చి జోగిని తలపై ఎత్తారు. డిప్యూటీ సీఎం నివాసం నుంచి ప్రజాభవన్ ఆవరణలో ఉన్న నల్ల పోచమ్మ దేవాలయం వరకు డబ్బు చప్పుళ్ళు, పోతురాజుల విన్యాసాల మధ్య బోనాలను ఎత్తు కెళ్లారు. అనంతరం అమ్మవారికి డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క దంపతులు బోనంలో ఉన్న నైవేద్యాన్ని సమర్పించారు.

### సీఎం ప్రత్యేక పూజలు

ప్రజాభవన్‌లోని నల్ల పోచమ్మ దేవాలయంలో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కతో కలిసి సీఎం రేవంత్ రెడ్డి, రాష్ట్ర మంత్రులు పొన్నం ప్రభాకర్ శ్రీధర్ బాబు, జూపల్లి కృష్ణారావు, ప్రభుత్వ సలహాదారు వేంరెడ్డి నరేందర్ రెడ్డి, ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి, ఖైరతాబాద్ డీసీసీ అధ్యక్షులు రోహిణి రెడ్డి తదితరులు ప్రత్యేక పూజలు చేశారు.

తెలంగాణ రాష్ట్రం సుభిక్షంగా సురక్షితంగా ఉండాలని సమృద్ధిగా వర్షాలు కురిసి పాడి పంటలతో రాష్ట్రం విలసిల్లాలని అమ్మవారిని వేడుకున్నారు. ప్రత్యేక పూజల అనంతరం ఆలయ పండితులు ముఖ్య మంత్రికి, రాష్ట్ర మంత్రులకు వేద ఆశీర్వచనం చేశారు.

ఈ కార్యక్రమంలో ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్, ఆది శ్రీనివాస్, శాసనసభ్యులు మాలోతు రాందాస్ నాయక్, వీర్లపల్లి శంకర్, శ్రీహరి, గణేష్, కాలే యాదయ్య, మక్కాన్ సింగ్ ఠాగూర్, ఎన్ ఉత్తం పద్మావతి, పర్ణిక రెడ్డి, మదన్మోహన్రావు, రామ్మోహన్ రెడ్డి, గండ్ర సత్యనారాయణ, విజయ రమణారావు, మాజీ ఎమ్మెల్యే కేఎల్ఆర్, కార్పొరేషన్ చైర్మన్లు రాయల నాగేశ్వరరావు, నాయుడు సత్యం తదితరులు పాల్గొన్నారు.



జూరాల ప్రాజెక్టులో నీటిమట్టం పెరుగుతున్న దృశ్యం


## జూరాల ప్రాజెక్టుకు భారీగా వరద నీరు

### ఆలమట్టికి పెరుగుతున్న వరద

గద్వాల,జూలై14(నమస్తే ఉదయం): కర్ణాటకలోని ఆలమట్టి ప్రాజెక్టుకు వరద తాకిడి మొదలైంది. వారం రోజులుగా మహారాష్ట్రలో కురుస్తున్న భారీ వర్షాల కారణంగా కృష్ణా బేసిన్‌లోని ఆల్మట్టి ప్రాజెక్టులోకి భారీగా వరద నీరు వచ్చి చేరుతోంది. ఆదివారం ఆల్మట్టి ప్రాజెక్టులోకి దాదాపు 28వేల క్యూసెక్కుల వరద నీరు వస్తోంది. దాంతో ఆల్మట్టికి జలకళ సంతరించుకుంది. ఆల్మట్టికి వరద ప్రవాహం క్రమంగా పెరగవచ్చని, నదీ పరివాహక ప్రాంతాల వారు అప్రమత్తంగా ఉండాలని కర్ణాటక అధికారులు హెచ్చరికలు జారీ చేశారు. ఈ సీజన్ లో ఆల్మట్టికి వరద ప్రవాహం పెరగడంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఆదివారం సాయంత్రం నాటికి ఆల మట్టి ప్రాజెక్టు 129.72 టీఎంసీల నీటి సామర్థ్యానికిగాను దాదాపు 91.130 టీఎంసీల నీరు నిల్వ ఉంది. 129.72 టీఎంసీల నీటి సామర్థ్యం గల అతి పెద్ద ప్రాజెక్టు. ఇంకా ఈ వరద ప్రవాహం పెరిగే అవకాశం ఉందని అధికారులు వెల్లడించారు. వరద ప్రవాహాన్ని దృష్టిలో ఉంచుకుని దిగువన ఉన్న నారాయణపూర్ ప్రాజెక్టులోకి నీటిని విడుదల చేసే అవకాశం ఉంటుంది. కాగ ఆల్మట్టి ప్రాజెక్టు నుండి సాగు నీటి అవసరాల కోసం 15,000 క్యూసెక్కుల నీటిని దిగువనకు విడుదల చేశారు. నారాయణపూర్ డ్యాంకు 3,414 క్యూసెక్కుల ఇన్ ఫ్లో నమోదు కాగ 37.64 టీఎంసిల నీటి సామర్థ్యానికి 25.83 టిఎంసిల నీరు నిల్వ ఉంది. జూరాలకు 3,271 క్యూసెక్కుల ఇన్ ఫ్లో నమోదు కాగ నీరు జూరాల ప్రాజెక్టు నీటి సామర్థ్యం 9.657 టీఎంసీలు. కానీ ప్రస్తుతం ప్రాజెక్టులో 7.627 టీఎంసీల నీరు మాత్రమే నిల్వ ఉంది. జూరాల ప్రాజెక్టుకు అనుసంధానంగా ఉన్న నెట్టెంపాడు లిఫ్టుకు 750, భీమా లిఫ్టుకు 528 క్యూసెక్కుల వరద నీటిని విడుదల చేయగా, ఎడమ కాలువకు 390 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు.

## హరీష్ రావు ఒక్కడే మంచి లీడర్

- ప్రశంసలతో ఆకాశానికెత్తేసిన బండి సంజయ్..
- హరీష్ రావుపై బండి సంజయ్ ప్రశంసల జల్లు
- బీఆర్ఎస్ పార్టీలో హరీష్ రావు ఒక్కడే మంచి నేత అని కితాబు
- హరీష్ బీజేపీలోకి వచ్చినా రాజీనామా చేయాల్సిందేనని స్పష్టం





హైదరాబాద్,జూలై14(నమస్తే ఉదయం): తెలంగాణలో రాజకీయాలు రోజు రోజుకు ఆసక్తికరంగా మారుతున్నాయి. ఓవైపు.. బీఆర్ఎస్ ఎమ్మెల్యేలంతా ఒక్కొక్కరిగా కాంగ్రెస్ పార్టీ కండువా కప్పుకుంటున్నారు. ఇప్పటికే 9 మంది ఎమ్మెల్యేలు అధికారికంగా కాంగ్రెస్ గూటికి చేరుకోగా.. మరికొంత మంది సిద్ధంగా ఉన్నట్టు సమాచారం. ఈ క్రమంలోనే.. బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు బీజేపీలోకి వచ్చేందుకు కూడా సిద్ధంగా ఉన్నారని.. కానీ అలా వచ్చే ఎమ్మెల్యేలు కచ్చితంగా ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేసే రావాలంటూ షరతు పెట్టటంతో వెనకాడుతున్నారని కమలనాథులు చెప్తున్నారు. ఈ నేపథ్యంలోనే.. బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీష్ రావుపై బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ సంచలన వ్యాఖ్యలు చేశారు.

కరీంనగర్‌లో నిర్వహించిన మున్నూరు కాపు ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్న బండి సంజయ్.. అనంతరం మీడియాతో మాట్లాడుతూ కీలక వ్యాఖ్యలు చేశారు. హరీష్ రావు మంచి నాయకుడని.. ప్రజల మనిషి అని తెలిపారు. తెలంగాణ ఉద్యమంలో పోరాడాడని.. ప్రజల కోసం ఆరాటపడే వ్యక్తి అంటూ ప్రశంసించారు. బీఆర్ఎస్ పార్టీలో హరీష్ రావు ఒక్కడే మంచి నేత అన్నారు. కేసీఆర్, కేటీఆర్, కవిత.. ఆ కుటుంబ సభ్యులందరిపై మిగతా.. 2లో

## అగ్రరాజ్యం అమెరికాలో ట్రంప్‌పై హత్యాయత్నం

### పెన్సిల్వేనియాలో ఎన్నికల ప్రచారం చేస్తుండగా ట్రంప్ పై కాల్పులు

### ట్రంప్ చెవికి గాయం... నిందితుడి కాల్చివేత

### ఆగంతుకుడి గురించి ఓ వ్యక్తి పోలీసులకు చెప్పినా పట్టించుకోని వైనం

అమెరికా,జూలై14(నమస్తే ఉదయం): అమెరికా మాజీ అధ్యక్షుడు, రిపబ్లికన్ పార్టీ అధ్యక్ష అభ్యర్థి డొనాల్డ్ ట్రంప్ అదృష్టం కొద్దీ ప్రాణాలతో బతికి బయటపడ్డాడు. ఓ సాయుధుడు జరిపిన కాల్పుల్లో ట్రంప్ కణత కొద్దిలో మిస్సయింది. ఆయన చెవికి గాయమైంది. ట్రంప్‌పై కాల్పులు జరిగిన క్షణాల వ్యవధిలోనే సీక్రెట్ సర్వీస్ స్నైపర్లు కౌంటర్ అటాక్ చేసి ఆ దుండగుడ్ని మట్టుబెట్టారు.

కాగా, ట్రంప్ ప్రస్తుతం అమెరికా అధ్యక్షుడు కాకపోయినా, ఆయనకు అత్యున్నత స్థాయిలో భద్రత ఉంటుంది. కానీ, అంతటి భద్రతలోనూ లొసుగులు ఉన్నట్టు తాజా ఘటనతో నిరూపితమైంది. ట్రంప్







సభకు వచ్చిన ఓ వ్యక్తి... తుపాకీతో ఉన్న ఓ ఆగంతుకుడ్ని తాను చూశానని చెప్పినా, భద్రతా సిబ్బంది పట్టించుకోలేదన్న విషయం తాజాగా వెల్లడైంది. గ్రెగ్ స్మిత్ అనే ఆ ప్రత్యక్ష సాక్షి ఏమని చెప్పాడంటే... "బట్లర్ కౌంటీలో ట్రంప్ మీటింగ్ జరుగుతున్న సమయంలో ఓ వ్యక్తి తుపాకీతో పాకుతూ బిల్డింగ్ పైకి ఎక్కడం చూశాను. అతడి వద్ద తుపాకీ ఉన్న విషయం స్పష్టంగా అర్థమవుతోంది. ఆ సాయుధుడి విషయాన్ని పోలీసులకు తెలియజేశాను. కానీ వారికి అతడు కనిపించలేదనుకుంటా. ఇంతలో నేను... ఈ ట్రంప్ ఇంకా ఎందుకు మాట్లాడుతున్నాడు... ఎవరైనా అతడిని స్టేజి మీద నుంచి లాగిపడేయొచ్చు కదా అంటూ విసుగ్గా ఫీలయ్యాను. అంతలోనే తుపాకీ కాల్పులు మోత వినిపించింది. బహుశా ఐదు రౌండ్ల కాల్పులు జరిగి ఉండొచ్చు" అని వివరించాడు. ప్రత్యక్ష సాక్షి గ్రెగ్ స్మిత్... కాల్పుల అనంతరం సీక్రెట్ సర్వీస్ ఏజెంట్లు భవనంపై ఉన్న ఆ ఆగంతుకుడ్ని కాల్చివేయడం కూడా చూశాడు.



## మహేశ్వరంలో అద్భుత నగరం

- రాచకొండలో మరో ఫిల్మ్‌సిటీ
- పౌరుషానికి, పోరాటానికి మారుపేరు గౌడన్నలు
- ప్రభుత్వ భూముల్లో తాటి, ఈత చెట్లు పెంచేలా చర్యలు
- మీ పిల్లలను ఉన్నత చదువులు చదివించండి
- త్వరలోనే హయత్ నగర్‌కు మెట్రో
- ఫామ్ హౌస్‌లో ఉన్నోళ్లను నేను అడుగుతున్నా... మీరేం తెచ్చారు? డ్రగ్స్, గంజాయి తప్ప!
- అబ్దుల్లాపూర్5మెట్‌లో "కాటమయ్య రక్షణ కవచం" పంపిణీ కార్యక్రమంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి
- గౌడన్నలతో సహపంక్తి భోజనం చేసిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్, మంత్రులు

అబ్దుల్లాపూర్‌మెట్, (నమస్తే ఉదయం): ఆనాడు కాంగ్రెస్ అధికారంలోకి రావాలని గౌడన్నలు ఎంతో ప్రచారం చేశారు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తేనే బలహీనవర్గాల గౌరవం పెరుగుతుందని గౌడన్నలు ప్రచారం చేశారు. పౌరుషానికి, పోరాటానికి మారుపేరు గౌడన్నలు. కులవృత్తులకు చేయూత అందించడానికి మా ప్రభుత్వం కట్టుబడి ఉంది. ఎవరెస్టు ఎక్కిన వారి అనుభవం గౌడన్నల రక్షణకు ఉపయోగపడింది. వారిని నేను మనస్ఫూర్తిగా అభినందిస్తున్నా... బలహీన వర్గాల మిగతా.. 2లో

## హైదరాబాద్‌లో భారీవర్షం

### - అత్యవసరమైతే తప్ప బయటకు రావొద్దన్న మేయర్

హైదరాబాద్,జూలై14(నమస్తే ఉదయం): హైదరాబాద్‌లోని పలు ప్రాంతాల్లో వర్షాలు కురుస్తున్నాయి. మియాపూర్, చందానగర్, లింగంపల్లి, కూకట్‌పల్లి, మూసాపేట, హైదర్‌నగర్, కేపీహెచ్‌బీ కాలనీ, బాచుపల్లి, ప్రగతినగర్, మల్కాజిగిరి, కుషాయిగూడ,



దమ్మాయిపేట వర్షం కురిసింది. చర్లపల్లి, కీసర, నిజాంపేట, నేరేడ్‌మెట్, అమీర్‌పేట్, ఈఎస్ఐ, ఎర్రగడ్డ, సనత్‌నగర్, బోరబండ, పంజాగుట్ట, జూబ్లీహిల్స్‌లో మోస్తరు వర్షం కురుస్తోంది. నాంపల్లి, అబిడ్స్, కోఠి, బషీర్‌బాగ్, నారాయణగూడ, హిమాయత్‌నగర్ , ఖైరతాబాద్, లక్డికపూల్‌లో వర్షం భారీగా పడుతోంది. మేడ్చల్, కృష్ణాపూర్, మల్లంపేట్, గండిమైసమ్మ, దుండిగల్‌లో ప్రాంతాల్లోనూ మోస్తరు నుంచి భారీవాన పడింది.

సికింద్రాబాద్ పరిధిలోని రెజిమెంటల్ బజార్, పాలిక బజార్, మొండా మార్కెట్ ప్రాంతాల్లో భారీగా రహదారుల పైకి చేరిన వరద నీరు చేరింది. మోకాళ్ల లోతు నీరు రహదారులపై ప్రవహిస్తుండడంతో పాదచారులు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఆదివారం సాయంత్రం అలా సరదాగా బయటకు వచ్చిన నగరవాసులు చాలామంది వర్షంలో చిక్కుకుపోయారు. నగరం అంతటా వర్షం కురవడంతో రోడ్లపై నీళ్లు నిలిచిపోయి ట్రాఫిక్ ఆగిపోయింది. చాలా చోట్ల కిలోమీటర్ల మేర వాహనాలు ఆగిపోయాయి. ట్రాఫిక్ పోలీసులు, జీహెచ్ఎంసీ యాక్షన్ టీమ్స్ వర్షపు నీటికి మళ్లించేందుకు ప్రయత్నిస్తున్నారు. లోతట్టు ప్రాంతాల్లో వరదనీరు చేరు చాలాచోట్ల రహదారులు చెరువులను తలపించాయి.


**కొట్టుకుపోయిన కార్లు:** ముషీరాబాద్ పరిధిలోని రాంనగర్, అశోక్‌నగర్, ఆర్టీసీ క్రాస్ రోడ్స్‌లో భారీవర్షం కురిసింది. వాననీటితో రహదారులు నిండిపోయాయి. రాంనగర్‌లోని స్ట్రీట్ నంబర్ 17లో వరద ఉధృతిలో ఓ కారు చిక్కుకుపోయింది. డోర్లు ఎంతకీ ఓపెన్ కాకపోవడంతో అందులో ఉన్న నలుగురు ప్రయాణికులు బయటకు రాలేకపోయారు. చివరకు స్థానిక యువకుడు ప్రణీత్, అతడి స్నేహితులు రిస్క్ చేసి కారును గోడ పక్కకు తెచ్చారు. అద్దాలు పగలగొట్టి అందులో ఉన్న వారిని బయటకు తీసుకొచ్చారు.

జూబ్లీహిల్స్, బంజారాహిల్స్, బోరబండ, ఈఎస్ఐ, సనత్‌నగర్, పంజాగుట్ట ప్రాంతాల్లో భారీ వర్షం పడింది. ఈ వర్షానికి జూబ్లీహిల్స్ నియోజకవర్గంలోని కృష్ణానగర్‌లో మోకాళ్ల లోతు వరకు నీళ్లు రావడంతో ప్రజలు తీవ్రంగా ఇబ్బందులు పడ్డారు. ఎగువ నుంచి ప్రవాహం పెరగడంతో రోడ్లపై వర్షపు నీరు వరదలా మారింది. వాహనాల రాకపోకలు పూర్తిగా నిలిచి పోయాయి. వరద నీళ్లలో ఒక కారు కొట్టుకు పోయింది. స్థానికులు కారును ఆపాలనుకున్నా దూసుకువస్తున్న వరదను చూసి కారును చేరుకునే సాహసం చేయలేదు.

**అవసరమైతేనే బయటకు రండి:** భారీవర్షం కురవడంతో జీహెచ్ఎంసీ అధికారులు రంగంలోకి దిగారు. ప్రజలు ఇళ్ల నుంచి రావొద్దని జీహెచ్ఎంసీ మేయర్ విజయ లక్ష్మి హెచ్చరికలు జారీచేశారు. మరో గంట పాటు వర్షం కురిసే అవకాశం ఉందన్నారు.

అత్యవసరసమైతే తప్పా ప్రజలు ఇళ్లు విడిచి బయటకు రావొద్దని సూచించారు. వర్షానికి సంబంధించి ఏమైనా అత్యవసర సహాయం అవసరమైతే 040-21111111, 9000113667 ఈ నెంబర్లకు ఫోన్ చేయాలని తెలిపారు.





వైద్యం కోసం సీఎం సహాయ నిధి పత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే కృష్ణ మోహన్ రెడ్డి, చికిత్స కోసం సీఎం రిలీఫ్ ఫండ్ లెటర్ అందజేస్తున్న ఎమ్మెల్యే కృష్ణ మోహన్ రెడ్డి

## రోగులకు వైద్య చికిత్స కోసం సీఎం సహాయనిధి

# చెక్కును అందజేసిన ఎమ్మెల్యే కృష్ణమోహన్ రెడ్డి

**గద్వాల జిల్లా ప్రతినిధి, జూలై 14(నమస్తే ఉదయం):** పేదలకు మెరుగైన వైద్యం అందించటానికి ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటుందని గద్వాల శాసనసభ్యులు బండ్ల కృష్ణమోహన్ రెడ్డి అన్నారు. ఆదివారం గద్వాల జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో గట్టు మండల పరిధిలోని పెంచికలపాడు గ్రామానికి చెందిన చాకలి గంగన్నకి చికిత్స నిమిత్తం ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డి చేతుల మీదుగా సీఎం సహాయనిధి క్రింద 8 వేల రూపాయల, మండల పరిధిలోని లింగాపురం గ్రామానికి చెందిన పుష్పలతకి చికిత్స నిమిత్తం 7 వేల రూపాయల చెక్కును వారి కుటుంబ సభ్యులకు అందజేశారు.

ఈ కార్యక్రమంలో మాజీ వైస్ ఎంపీపీ సుదర్శన్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ నాయకులు హనుమంతు రెడ్డి, నరేందర్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## జాతీయస్థాయి టైక్వాండో ఓపెన్ ఛాంపియన్షిప్‌లో

# కొత్తకోట విద్యార్థికి బంగారు పతకం కైవసం

### విద్యార్థిని ప్రత్యేకంగా అభినందించిన గ్రాండ్ మాస్టర్



**కొత్తకోట, జూలై 14(నమస్తే ఉదయం):** కొత్తకోట పట్టణానికి చెందిన విద్యార్థి జాతీయస్థాయి టైక్వాండో ఓపెన్ ఛాంపియన్షిప్‌లో బంగారు పతకం కైవసం చేసుకున్నారు.

హైదరాబాద్‌లో ఈనెల 12, 13, 14 తేదీలలో శ్రీ కోట్ల విజయభాస్కర్ రెడ్డి ఇండోర్ స్టేడి యంలో నిర్వహించిన జాతీయస్థాయి ఓపెన్ ఛాంపియన్షిప్ పోటీలు వెట్రాన్స్ ఇండియా స్పోర్ట్స్ వింగ్ తెలంగాణ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ పోటీలు నిర్వహించారు. ఈ పోటీలకు తమిళనాడు మహారాష్ట్ర,కర్ణాటక, ఆంధ్ర ప్రదేశ్, ఒడిస్సా, ఉత్తర ప్రదేశ్‌కి చెందిన క్రీడాకారులు పాల్గొన్నారు. ఈ పోటీలలో కొత్తకోటకు చెందిన గాడ్స్ అన్ వారియర్స్ టైక్వాండో కాడమీ చెందిన మాస్టర్ అబ్దుల్ నబీ శిష్యులు పాల్గొని బంగారు పతకం సాధించాలని తెలిపారు. అండర్ 13 ఇయర్స్, 26 కేజీల విభాగంలో పోంసే ఈవెంట్లో , పాల్గొని ఎస్.కె గౌస్ పాషా బంగారు పతకం సాధించారు. పథకం సాధించిన విద్యార్థికి గ్రాండ్ మాస్టర్ జయంతి రెడ్డి చేతుల మీదుగా పథకం అందజేశారు. ఈ సందర్భంగా మాస్టర్ అబ్దుల్ నబీ , సయ్యద్ మహమ్మద్,అజాద్ , జాఫర్ సాదిక్, హరీష్ యాదవ్,పృధ్వీరాజ్, శివరాజ్, ఇంతియాజ్, అంజి, అరవింద,చారి, కురుమూర్తి యాదవ్, మీ విద్యార్థిని ప్రత్యేకంగా అభినందించారు.




స్ప్రింగ్ ఫీల్డ్ హై స్కూల్ కరస్పాండెంట్ జగన్మోహన్ రెడ్డిని సన్మానిస్తున్న విద్యార్థులు

# క్రమశిక్షణతో కూడిన విద్యకు ప్రాధాన్యత

### స్ప్రింగ్ ఫీల్డ్ హై స్కూల్ కరస్పాండెంట్ జగన్మోహన్ రెడ్డి

### రాజేంద్రనగర్ స్ప్రింగ్ ఫీల్డ్ హైస్కూల్ 1998-1999 బ్యాచ్ పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం..

### ఆత్మీయ పలకరింపులు ఆటపాటలతో సందడి

**రాజేంద్రనగర్,జులై 14(నమస్తే ఉదయం):** వారంతా వివిధ హెూదాల్లో, ఉన్నత స్థానాల్లో, స్థిరపడి పదిమందికి ఉద్యోగ,ఉపాధి కల్పించే స్థాయి కలిగిన వ్యక్తులు..గత 25 సంవత్సరాల క్రితం తాము చదువుకున్న పాఠశాలలో ఆనాటి ఉపాధ్యాయులు, మిత్రులను చూడగానే చిన్నారులుగా మారిపోయి పలకరింపులు,ఆత్మీయ కరచాలనాలతో ఎంతో సందడి చేశారు. ఈ అపూర్వ సంఘటన ఆదివారం రాజేంద్రనగర్ లోని స్ప్రింగ్ ఫీల్డ్ హైస్కూల్ ఆవరణలో చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళితే.. రాజేంద్రనగర్‌లోని స్ప్రింగ్ హై స్కూల్లో (1998 -1999) పదవ తరగతి పూర్తిచేసిన విద్యార్థులు ఆదివారం ఉదయం "పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనాన్ని" పాఠశాల ఆవరణలో ఘనంగా నిర్వహించారు.

ఈ సందర్భంగా తమకు విద్యాబోధన చేసినటు వంటి ప్రిన్సిపాల్ డాక్టర్ పి.జగన్మోహన్ రెడ్డి, అనితా మేడమ్, ఉపాధ్యా యులు మంజు జోషి, శోభరాణి, శాస్త్రి,కృష్ణయ్య ,సంజయ్ కుమార్, అజీజ్, ప్రభాకర్ తదితర ఉపాధ్యాయులను వారు ఘనంగా సన్మానిం చారు. వారి పాత జ్ఞాపకాలను తోటి స్నేహి తులతో నెమరు వేసుకొని, కుశల ప్రశ్నలు అడిగి తెలుసు కున్నారు. రోజంతా ఆటలు పాటలతో ఎంతో సందడి చేసి తమ జ్ఞాపకాలను తోటి మిత్రులతో పంచుకున్నారు.

పూర్వ విద్యార్థులు శ్రావణ్,చరణ్, సుమలత, వాసవి, రాధిక, వరలక్ష్మి, దేవేందర్, సుజాత, నాగలక్ష్మి, గంగాధర్, స్రవంతి, సుభాష్, నరేందర్, పూర్వ విద్యార్థులు రాజేష్ గౌడ్, శ్రావణ్ కుమార్, గాయత్రి చరణ్, సుభాష్, నరసింహ, దేవేందర్ గౌడ్, శ్రీనివాస్ రెడ్డి ,సుమలత రెడ్డి పాల్గొన్నారు.



98-99 విద్యార్థుల సమ్మేళనం




ఆత్మహత్య చేసుకున్న ఎస్ఐ శ్రీనివాస్ కుటుంబానికి 25 లక్షల చెక్కు అందజేస్తున్న బ్యాచ్ మేట్లు

# బ్యాచ్ మేట్లే.. తోబుట్టువులుగా..

**హైదరాబాద్, జూలై 14(నమస్తే ఉదయం):** ఆత్మహత్య చేసుకున్న ఎస్ఐ కుటుంబానికి బ్యాచ్ మేట్లే.. తోబుట్టువులుగా.. నిలిచారు. శ్రీనివాస్ కుటుంబానికి బ్యాచ్‌మేట్‌లో 25 లక్షల రూపాయల ఆర్థికసాయం అందజేశారు.

ఏడాదిపాటు ట్రైనింగ్‌లో శ్రీరాముల శ్రీను తోటివారితో ఆప్యాయంగా మెలిగేవారని గుర్తు చేసుకుంటున్నారు. గాయాన్ని కొంతైనా మాన్పించే సాయంలి.. నీఆత్మకు శాంతి చేకూర్చే ఆర్థిక దీపం అంటూ 2014 ఏపీ-తెలంగాణ ఎస్సై వెల్ఫేర్ బ్యాచ్ మేట్స్ ఆధ్వర్యంలో ఎస్సై శ్రీరాముల శ్రీను కుటుంబానికి 25లక్షల రూపాయల చెక్కు ను ఎస్సైలు అందజేశారు.

**అశ్వరావుపేట ఎస్సై శ్రీనివాస్ కుటుంబానికి ఆర్థిక సాయం**

**రూ.25 లక్షల చెక్కు అందించిన 2014 బ్యాచ్ మేట్లు**



పాతబస్తీ భాగ్యలక్ష్మి ఆలయంలో పూజలు చేస్తున్న ప్రశాసన్ కమిటీ ప్రతినిధులు

# భాగ్యలక్ష్మి అమ్మవారిని దర్శించుకున్న ప్రశాసన్ కమిటీ

**రాజేంద్రనగర్, జూలై14(నమస్తే ఉదయం):** చారిత్రాత్మక పాతబస్తీ భాగ్యలక్ష్మి అమ్మవారిని ప్రశా సన్ కమిటీ ప్రతినిధులు దర్శించుకుని అమ్మవారికి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఆదివారం రామ రాజ్య ప్రశాసన్ అయోధ్య అఖిల్ భారతీయ ప్రాశాసక్ రాచూరి రాజశేఖర్ ఆద్వర్యంలో జాతీయ రాజ్యసభ రెండవ రోజు మహేశ్వరం మండలంలోని నాగారం లో జరిగినది. రాజ్యసభ సమోరప్ అనంతరం ప్రశా సన్ కమిటీ అంత కలిసి చార్మినార్ భాగ్యలక్ష్మి అమ్మ వారును దర్శించుకోవడం జరిగింది.

ఆలయ కమిటీ సాదరంగా అమ్మవారికి అర్చన చేయించారు. అనం తరం జాతీయ ప్రశాసక్ భాస్కర్ సింగ్ మాట్లా డుతూ... తెలంగాణలో రాజ్యసభ విజయవంతం అయ్యిందన్నారు. భాగ్యలక్ష్మి అమ్మ వారిని దర్శించు కోవడం పూర్వ జన్మ సుకృతం అని అన్నారు .తదుపరి రాజ్యసభ వచ్చే ఏడాది రాజస్థాన్ రాష్ట్రంలో నిర్వహించడానికి జాతీయ కమిటీ నిర్ణ యించింది.

ఈ కార్యక్రమములో జాతీయ సంరక్షక్ వై.శ్రీధర్ ,జాతీయ రాజ్ కోశాధికారి శ్రవణ్, అయోధ్య ప్రాభారీ రవి తివారీ, ఢిల్లీ ప్రముఖ్ శ్రవణ్ సదర్ ,తెలంగాణ ప్రాముఖ్ కేవీ.నర్సింగ్ రావు, ఆంధ్రప్రదేశ్ ప్రముఖ్ పిల్ల వినోద్ కుమార్, రాజస్థాన్ ప్రముఖ్, మహావీర్ డాంగి, ఉత్తరప్రదేశ్ ప్రముఖ్ వికాస్ జి.మధ్యప్రదేశ్ ప్రముఖ్ వీరేందర్, తెలంగాణ రాజ్ కోశాధికారి కాడెం సుధాకర్, తెలంగాణ సంరక్షక్ మొంద్ర కొమరయ్య, దుర్గాప్రసాద్ అనునాయ్, వివిధ రాష్ట్రాల పదాధికారులు పాల్గొన్నారు.

# హరీష్ రావు ఒక్కడే మంచి లీడర్

(మొదటి పేజీ తరువాయి)

అవినీతి ఆరోపణలున్నాయని.. కానీ హరీష్ రావు ఒక్కడే వివాదరహిత నేతల అంటూ కొనియాడారు. "ఇలా చెప్తున్నా అంటే.. హరీశ్ రావును నేను ఫోన్ చేశాననో, మాట్లాడాననో.. ఆయన బీజేపీలోకి వస్తున్నారనో.. అర్థం కాదు. ఆయనపై నాకున్న అభిప్రాయాన్ని చెప్తున్నా.. అంతే." అంటూ బండి సంజయ్ వెంటనే క్లారిటీ ఇచ్చారు. అయితే.. హరీష్ రావు బీజేపీలోకి రావాలన్నా.. ఆయన తన ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేయాల్సిందేనని బండి సంజయ్ చెప్పుకొచ్చారు. ఎలాగూ హరీష్ రావుకు జనాధరణ బాగానే ఉంది కాబట్టి ఆయన సులువుగానే గెలుస్తాడని.. బండి సంజయ్ చెప్పుకొచ్చారు.

మరోవైపు.. బీజేపీలో బీఆర్ఎస్ఎల్పీ విలీనం అనేది ఒక డ్రామా అని బండి సంజయ్ కొట్టిపారేశారు. బీజేపీలోకి ఎవరు వచ్చినా రాజీనామా చేసే రావాలని మరోసారి క్లారిటీ ఇచ్చారు. అంతే కాకుండా.. గతంలో బీజేపీని, బీజేపీ నేతలను కేసీఆర్.. తీవ్రస్థాయిలో అవమానించారని గుర్తుచేశారు. కేంద్రంలో అధికారంలో ఉన్నప్పటికీ.. హేళన చేస్తూ మాట్లాడేవారన్నారు. మొన్నటి పార్లమెంట్ ఎన్నికల్లో 8 ఎంపీ స్థానాలు గెలిచామని.. బీఆర్ఎస్ పార్టీకి కనీసం ఒక్క సీటు కూడా రాలేదని ఎద్దేవా చేశారు. ఇప్పుడు బీఆర్ఎస్ పార్టీ ఎక్కడుందని వెతుక్కోవాల్సిన పరిస్థితి వచ్చిందంటూ విమర్శించారు బండి సంజయ్.

ప్రస్తుతం రాష్ట్రంలో నెలకొన్న రాజకీయ పరిస్థితుల నేపథ్యంలో.. బండి సంజయ్ చేసిన వ్యాఖ్యలు ఇప్పుడు చర్చనీయాంశంగా మారాయి. ఉన్నట్టుండి.. హరీష్ రావుపై బండి సంజయ్ ఎందుకు ఇంతగా ప్రశంసల జల్లు కురిపిస్తున్నారన్న చర్చ మొదలైంది. ఒకవేళ.. హరీష్ రావును బీజేపీ నాయకత్వం టార్గెట్ చేసిందా అన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. చోటామోటా ఎమ్మెల్యేలంతా కాంగ్రెస్ పార్టీలో చేరిపోతుంటే.. కీలక నేత అయిన హరీష్ రావును బీజేపీలోకి లాకొచ్చుకుందామని కమలం పార్టీ ప్లాన్ ఏమైనా వేసిందా అని చర్చించుకుంటున్నారు బీఆర్ఎస్ శ్రేణులు.

# మహేశ్వరంలో అద్భుత నగరం

(మొదటిపేజీ తరువాయి..)

అభ్యున్నతికి కాంగ్రెస్ కృషి చేస్తోంది. వైఎస్ఆర్ హయాంలో బలహీన వర్గాల కోసం ఫీజు రీయింబర్స్ మెంట్ తీసుకొచ్చారు. ఫీజు రీయింబర్స్ మెంట్ ను ముందుకు తీసుకెళ్లేందుకు మా ప్రభుత్వం కట్టుబడి ఉంది.

ప్రభుత్వ భూముల్లో తాటి, ఈత చెట్లు పెంచేలా చర్యలు చేపట్టేందుకు మాకు ఎలాంటి అభ్యంతరం లేదు. రాష్ట్రంలో వనమహోత్సవంలో భాగంగా తాటి, ఈత చెట్ల పెంపకం చేపట్టాలని మంత్రి జూపల్లికి సూచిస్తున్నా. చెరువు గట్లపై కూడా చెట్లు నాటాలి. ఇరిగేషన్ విభాగంతో మాట్లాడాలని మంత్రి శ్రీధర్ బాబుకు సూచిస్తున్నా. రహదారులు, చెరువుగట్లు, కాలువగట్ల వద్ద తాటి, ఈత చెట్లు పెంచేలా చర్యలు తీసుకుంటాం. గౌడన్నల కులవృత్తిని కాపాడేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉంది. కులవృత్తులపై ఆధారపడిన సోదరులకు విజ్ఞప్తి చేస్తున్నా. మీ పిల్లలను ఉన్నత చదువులు చదివించండి. వాళ్లను ఉన్నతాధికా రులుగా తీర్చి దిద్దండి. తెలంగాణ రాష్ట్ర పునర్నిర్మాణంలో వారు భాగస్వాములు కావాలి. చట్టాలు రూపొందించే స్థాయికి మీ పిల్లలు ఎదగాలి. బలహీన వర్గాలు పాలకులుగా మారాలంటే ఏకైక మార్గం చదువు మాత్రమే. త్వరలోనే హయత్ నగర్‌కు మెట్రో రాబోతుంది. ఇందుకు సంబంధించి అన్ని ప్రణాళికలు పూర్త య్యాయి. ఫార్మా కంపెనీల కోసం సేకరించిన భూమిలో వివిధ యూని వర్సిటీలను, మెడికల్ టూరిజం, పరిశ్రమల ఏర్పాటు చేసేలా ప్రణాళికలు రూపొందిస్తున్నాం.న్యూయార్క్ నగరంతో పోటీ పడేలా మహేశ్వరంలో ఒక అద్భుతమైన నగరం నిర్మించే బాధ్యత ప్రభుత్వం తీసుకుం టుంది. ఊటీ కంటే అద్భుతమైన రాచకొండ ప్రాంతాన్ని ఫిల్మ్ ఇండస్ట్రీకి అణువుగా మార్చ బోతున్నాం. రంగారెడ్డి జిల్లాకు మహర్దశ రాబోతోంది.

# నేపాల్ నూతన ప్రధానిగా కేపీ శర్మ ఓలి

**కాఠ్మాండూ, జూలై 14,(నమస్తే ఉదయం):** నేపాల్ నూతన ప్రధాన మంత్రిగా కేపీ శర్మ ఓలి(72) ఆదివారం నియమితులయ్యారు. చైనా సానుభూతి పరుడిగా పేరొందిన ఓలి నేపాల్ ప్రధాని కావడం ఇది నాలుగో సారి. పుష్ప కమల్ దహల్ ప్రచండ నేతృత్వంలోని ప్రభుత్వంపై పార్లమెంట్‌లో పెట్టిన అవిశ్వాస తీర్మానం శుక్రవారం నెగ్గింది. 275 'సీట్లున్న నేపాల్ పార్లమెంట్‌లో 194 మంది సభ్యులు అవిశ్వాస తీర్మానానికి మద్దతు పలికారు. కేవలం 66 మంది మాత్రమే ప్రచండ నాయకత్వానికి ఓటేశారు. దీంతో నూతన ప్రభుత్వ ఏర్పాటు అనివార్యమైంది.

ఈ క్రమంలోనే కేపీ శర్మ ఓలి నేతృత్వంలోని సీపీఎన్-యూఎంఎల్, నేపాలీ కాంగ్రెస్ పార్టీలు కలిసి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేశాయి. కేపీ శర్మ ఓలి ప్రమాణ స్వీకారం సోమవారం జరగనుంది. కాగా, సంకీర్ణ ప్రభుత్వం ఏర్పాటుపై నేపాలీ కాంగ్రెస్ అధ్యక్షుడు షేర్ బహదూర్ దేవ్‌బా, సీపీఎన్-యూఎంఎల్ చైర్మన్ కేపీ శర్మ ఓలి గతవారమే ఒప్పందం చేసుకున్నారు. దాని ప్రకారం తర్వాత తొలి 18 నెలలు ఓలి ప్రధానిగా ఉంటారు. ఆ తర్వాత పార్లమెంట్ గడువు ముగిసే వరకు దేవ్‌బా ప్రధానిగా కొనసాగుతారు.





## ఎమ్మార్పీఎస్ నాయకుడు నరేందర్‌ను నిర్బంధించిన ఫామ్ హౌస్‌ను గుర్తించాం...

**- రాజేంద్రనగర్ డీసీపీ చింతమనేని శ్రీనివాస్**

**గండిపేట్,జులై 14(నమస్తే ఉదయం):**
నార్సింగిలో కిడ్నాప్ గురైన ఎమ్మార్పీఎస్ నేత నరేందర్ ను దుండగులు నిర్బంధించిన ఫామ్ హౌస్‌ను గుర్తించామని రాజేంద్రనగర్ డీసీపీ చింతమనేని శ్రీనివాస్ తెలిపారు. ఈనెల 9వ తేదీన నార్సింగిలోని బృందావన్ కాలనీలో ఎమ్మార్పీఎస్ నాయకుడు నరేందర్ కనిపించకుండా పోయిన విషయం తెలిసిందే.. ఇలా ఉండగా కిడ్నాప్ కు పాల్పడిన దుండగులు ఆయనను శనివారం తెల్లవారుజామున ఆయన ఇంటి సమీపంలో వదిలేసి వెళ్లారు.ఈ ఘటనపై పోలీసులు పూర్తిస్థాయిలో దర్యాప్తు చేపట్టారు.శంషాబాద్ పట్టణంలోని ధర్మగిరి ఆలయ సమీపంలోని ఓ ఫామ్ హౌస్ లో దుండగులు నరేందర్ ని బంధించి చిత్ర హింసలకు గురి చేశారని తెలిపారు.కిడ్నాప్ కు పాల్పడిన దుండగుల ఫామ్ హౌస్ కు ఇరువైపులా భారీ ఎత్తున ప్రహరీ గోడలు నిర్మించి ఉన్నాయని,చుట్టుముట్టు ముళ్లకంచెలు ఉన్నట్లు డీసీపీ వివరించారు.దీంతో పాటు దుండగులు ఫామ్ హౌస్ చుట్టూ సీసీ కెమెరాలు  అమర్చుకున్నట్లు ఆయన సూచించారు.

### రాజేంద్రనగర్ బాబా క్లినిక్ ఆధ్వర్యంలో

## ఉచిత వైద్య శిబిరం

**రాజేంద్రనగర్, జూలై14(నమస్తే ఉదయం):**
రాజేంద్రనగర్‌లోని బాబా క్లినిక్ ఆధ్వర్యంలో శంషాబాద్ సన్‌రైజ్ హాస్పిటల్స్ సహకారంతో ఆదివారం రాజేంద్రనగర్‌లో ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరాన్ని రాజేంద్ర



ఉచిత వైద్య శిబిరాన్ని ప్రారంభిస్తున్న దుంబాల ఉమారెడ్డి, దుంబాల ఝాన్సీ రెడ్డి

నగర్ శ్రీ మాతా పోచమ్మ దేవాలయ కమిటీ చైర్మన్ దుంబాల ఉమారెడ్డి, రాజేంద్రనగర్ మహిళా మండలి అధ్యక్షురా దుంబాల ఝాన్సీ రెడ్డిలు ప్రారంభించారు. సన్‌రైజ్ హాస్పిటల్స్ డాక్టర్ల ఆధ్వర్యంలో178 మందికి వివిధ రకాల చికిత్సలు అందించారు. ఉచితంగా మందులను పంపిణీ చేశారు.

## బీఆర్ఎస్‌లోనే ఉంటా..

**- రాజేంద్రనగర్ కార్పొరేటర్ పి.అర్చన జయప్రకాష్**

**రాజేంద్రనగర్, జూలై14 (నమస్తే ఉదయం):**
కాంగ్రెస్‌లోకి రావాలని ఆ పార్టీ పెద్దల నుంచి ఫోన్లు వస్తున్నాయని, తాను మాత్రం బీఆర్ఎస్‌లోనే ఉంటానని రాజేంద్రనగర్ డివిజన్ కార్పొరేటర్ పొడవు అర్చన జయ ప్రకాష్ అన్నారు. రాజేంద్ర నగర్ సర్కిల్‌లో బీఆర్ఎస్ బలోపేతానికి కృషి చేస్తానన్నారు. గ్రేటర్ నుంచి నిధులు తీసుకువచ్చి రాజేంద్రనగర్ సర్కిల్‌లో అభివృద్ధి పనులు చేపడ తామన్నారు. మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్, మాజీ మంత్రులు కేటీఆర్, హరీష్ రావుల నాయకత్వంలో ముందుకు సాగుతా మన్నారు.



## ఘనంగా ముగిసిన ఇంటర్ డిస్ట్రిక్ట్ టైక్వాండో ఛాంపియన్ షిప్ టోర్నమెంట్

**గద్వాల,జూలై14(నమస్తే ఉదయం):**
జోగులాంబ గద్వాల జిల్లా టైక్వాండో అసోసియేషన్ అద్వర్యంలో నిర్వహించిన రెండు రోజుల ఇంటర్ డిస్ట్రిక్ట్ ఛాంపియన్ షిప్ పోటీలు ఆదివారం ఘనంగా ముగిశాయి. ఈ ఛాంపియన్ షిప్‌లో నాలుగు విభాగాలలో జిల్లా వ్యాప్తంగా ఉన్న 104 మంది క్రీడాకారులు ప్రథమ, ద్వితీయ స్థానాలలో బంగారు, సిల్వర్ పథకాలు పొందారు, పతకాలు సాధించిన విజేతలకు తెలంగాణ రాష్ట్ర టైక్వాండో కరాటే అసోసియేషన్

కరాటేలో విజేతలు



ప్రధాన కార్యదర్శి మాస్టర్ కె శ్రీహరి చేతుల మీదుగా బంగారు, సిల్వర్ పతకాలు అందజేశారు. ఈ ఇంటర్ డిస్ట్రిక్ట్ ఛాంపియన్ షిప్‌లో విజేతలైనా వారు ఈ నెల 19, 20, 21వ తేదీలలో మంచిర్యాల జిల్లా బెల్లంపల్లిలో జరిగే ఇంటర్ స్టేట్ ఛాంపియన్ షిప్ లో  పాల్గొంటారని మాస్టర్ శ్రీహరి తెలిపారు.

ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర టెక్నికల్ డైరెక్టర్ శ్రీనివాసులు, సీనియర్ కోచ్‌లు శ్రీనివాస్ శెట్టి, రంగస్వామి, మారుతి, అంజి, రామేశ్వరి, శ్రీను, ఆంజనేయులు, మల్లికార్జున్, రవి, రామాంజనేయులు, లింగేశ్వర్, తోపాటు పలువురు క్రీడాకారులు పాల్గొన్నారు.





ప్రతిష్టాపన శ్రీ సీతారామ లక్ష్మణ ఆంజనేయ స్వామి విగ్రహాల వద్ద భక్తులు, శ్రీ సీతారామ విగ్రహాలను ఊరేగింపుగా తీసుకెళుతున్న కాలనీవాసులు


# ఆలయానికి చేరుకున్న విగ్రహ మూర్తులు

### చైతన్య విలాస్ కాలనీ రామాలయంలో విగ్రహ ప్రతిష్టాపన కార్యక్రమానికి శ్రీకారం

**రాజేంద్రనగర్, జూలై14(నమస్తే ఉదయం):**
రాజేంద్ర నగర్ సర్కిల్ పరిధిలోని ఉప్పరపల్లి చైతన్య విలాస్ కాలనీలో శ్రీ సీతారామచంద్ర ఆలయంలో ఆగస్ట్ 9న విగ్రహ ప్రతిష్టాపన మహోత్సవ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించ డానికి ఆలయ కమిటీ ప్రతినిధులు శ్రీకారం చుట్టాలు. భద్రాచలం నుండి విగ్రహం మూర్తులు ఆదివారము ఆలయానికి ఆలయ కమిటీ ఆధ్వర్యంలో జనప్రియ చౌరస్తా నుండి ఆలయం వరకు మంగళ వాయిద్యాలతో స్వాగతం పలుకుతూ ఆలయానికి చేరుకున్నారు. ఆలయ కమిటీ ప్రతినిధులు మురళి, మహేష్, రాజేష్ ల ఆధ్వర్యంలో ఆలయం నిర్మాణం పూర్తి చేసుకొని విగ్రహ ప్రతిష్టాపన మహోత్సవ కార్యక్రమానికి సిద్ధమైంది.

కాలనీవాసుల సమిష్టి కృషితో ఆలయ నిర్మాణానికి పునాదులు వేశారు. ఆలయ నిర్మాణం పూర్తి చేసుకొని విగ్రహ ప్రతిష్టాపన మహోత్సవం భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించడానికి ఏర్పాట్లు చేస్తున్నారు.

ఆలయంలో
శ్రీ సీతారాముల విగ్రహాలు







ఆలయ కమిటీ ప్రతినిధులకు బోనాల ఉత్సవాల చెక్కులను అందజేస్తున్న తెలంగాణ రాష్ట్ర ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ రాజయ్య, ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్, కార్పొరేటర్ సంగీత

# రాష్ట్ర సంస్కృతికి ప్రతీక బోనాలు

**రాష్ట్ర ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ రాజయ్య**

**బోనాల ఉత్సవాలు భక్తిశ్రద్ధలతో శాంతియుతంగా జరుపుకోవాలి: ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్**

**సబ్బండ వర్గాలకు సమ ప్రాధాన్యత..**

**రాజేంద్రనగర్ సర్కిల్లో 68 అమ్మవారి దేవాలయలకు రూ.20.06 లక్షల విలువైన చెక్కులు పంపిణీ :**

**రాజేంద్రనగర్ ఎమ్మెల్యే టి.ప్రకాష్ గౌడ్**

**రాజేంద్రనగర్,జులై 14(నమస్తే ఉదయం):**
తెలంగాణ సంస్కృతి, సంప్రదాయ ప్రతీక బోనాలు అని రాజేంద్రనగర్ ఎమ్మెల్యే టి.ప్రకాష్ గౌడ్ అన్నారు.

బోనాల పండుగను పురస్కరించుకుని దేవాదాయశాఖ ఆధ్వర్యంలో ఆదివారం రాజేంద్రనగర్ సర్కిల్ పరిధిలోని 68 అమ్మవారి దేవాలయలకు బోనాల ఏర్పాట్ల కోసం రూ.20.06 లక్షల విలువైన చెక్కులను ఎస్ఎఫ్ సి చైర్మన్ రాజయ్యతో కలిసి ఎమ్మెల్యే టి.ప్రకాష్ గౌడ్ ఆలయ కమిటీ నిర్వాహకులకు అందజేశారు.ఈ సందర్భంగా తెలంగాణ రాష్ట్ర ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ రాజయ్య, ఎమ్మెల్యే టి.ప్రకాష్ గౌడ్ మాట్లాడుతూ...తెలంగాణ సంస్కృతిలో భాగమైన బోనాల పండుగలను ప్రతిబస్తీ,కాలనీల్లో ఎంతో ఉత్సాహంగా జరుపుకుంటారని తెలిపారు.ప్రభుత్వం బోనాల పండుగను ప్రతిష్టాత్మకంగా తీసుకొని అన్ని ఆలయాలకు నిధులు మంజూరు చేయడం జరిగందన్నారు.బోనాల పండుగ సందర్భంగా ఆలయాలవద్ద ఏర్పాట్ల కోసం ప్రత్యేకంగా నిధులు అందజేస్తోందన్నారు.

దేశంలో ఎక్కడా లేని విధంగా ప్రభుత్వం పండుగలకు ఆర్థిక సాయం అందిస్తోందన్నారు.బోనాల ఉత్సవాలను ఘనంగా నిర్వహించేందుకు ప్రభుత్వం ప్రత్యేకంగా నిధులను కేటాయిస్తూ సహకరిస్తుందన్నారు. బోనాల పండుగను ప్రజలు ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని సూచించారు. రాజేంద్రనగర్ వాడ వాడలో బోనాల జాతర వేడుకలను ఎంతో అంగరంగ వైభవంగా జరుపుకోవలనే ఉద్దేశంతో ప్రతిగుడికి బోనాల నిధులు మంజూరయ్యేలా కృషి చేశానన్నారు.

బోనాల సందర్భంగా ప్రతి గుడి వద్ద అన్ని రకాల మౌలిక వసతులు ఏర్పాటు చేయాలన్నారు.ప్రజలకు ఎటువంటి ఇబ్బంది లేకుండా అన్ని రకాల వసతుల కలిపిస్తూ ప్రశాంత వాతావరణంలో కలిపించాలన్నారు.రాజేంద్రనగర్ నియోజకవర్గ ప్రజలంత భక్తి శ్రద్ధలతో బోనాల పండుగను జరుపుకోవాలని, భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ఆలయ కమిటీ నిర్వాహకులు తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.ఆ అమ్మవారి ఆశీస్సులతో రాష్ట్రంలో సమృద్ధిగా వర్షాలు కురిసి, ప్రజలంతా సుఖసంతోషాలతో సుభిక్షంగా ఉండాలని ప్రార్థించినట్లు పేర్కొన్నారు.

ఈ కార్యక్రమంలో రాజేంద్రనగర్ డివిజన్ కార్పొరేటర్ సంగీత గౌరీ శంకర్, రాజేంద్రనగర్ తహసిల్దార్ బొమ్మ రాములు, సంబంధిత అధికారులు,ఆలయాల నిర్వాహకులు తదితరులు పాల్గొన్నారు.



హైదర్‌గూడ పోచమ్మ ఆలయంలో
సమావేశమైన బోనాల ఉత్సవ కమిటీ ప్రతినిధులు

# హైదరుగూడ శ్రీ శ్రీ పోచమ్మ బోనాల ఉత్సవాలు ఘనంగా నిర్వహిస్తాం

**ఆలయ ఉత్సవ కమిటీ**

**రాజేంద్రనగర్, జూలై14(నమస్తే ఉదయం):**
అత్తాపూర్ డివిజన్ పరిధిలోని హైదరుగూడ శ్రీ శ్రీ పోచమ్మ దేవాలయం బోనాల ఉత్సవాలను ఘనంగా నిర్వహించడానికి ఏర్పాట్లు జరుగుతున్నాయి. ఈనెల 28న జరిగే ఉత్సవంలో వివిధ ప్రాంతాల నుండి ప్రజలు పెద సంఖ్యలో పాల్గొంటారని ఆలయ కమిటీ ప్రకటించింది.

ఈ మేరకు ఉత్సవాలు ఏర్పాట్లపై ఆదివారం ఉదయం ఆలయ కమిటీ సమావేశం జరిగింది. బోనాల ఉత్సవాలు ఉదయం 6 గంటలకు అభిషేకంతో మొదలై రాత్రి ఘటాల ఊరేగింపుతో ముగుస్తుందని కమిటీ సమావేశం వెల్లడించింది. ఈ ఉత్సవాలలో ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని క్రమశిక్షణతో భక్తి శ్రద్ధలతో పూజలు నిర్వహించాలని కమిటీ కోరింది. భక్తులకు ఎ లాంటి అసౌకర్యం కలగకుండా అన్ని జాగ్రత్తలు తీసుకుంటున్నట్టు కమిటీ ప్రకటించింది.




### ముందస్తు అరెస్టులు ముఖ్యమంత్రి

# నియంతృత్వానికి నిదర్శనం...

**బీజేవైఎం రాష్ట్ర ఉపాధ్యక్షులు కుమార్ యాదవ్...**

**కూకట్‌పల్లి, జూలై 14 (నమస్తే ఉదయం):**
తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారిక పర్యటన సందర్భంగా ముందస్తు అరెస్టులు చేయడం ముఖ్యమంత్రి నియంతృత్వానికి నిదర్శనమని బీజేవైఎం రాష్ట్ర ఉపాధ్యక్షులు కుమార్ యాదవ్ అన్నారు. అల్విన్ కాలనీ డివిజన్ భూదేవి హిల్స్ కాలనీ లో బీజేవైఎం రాష్ట్ర ఉపాధ్యక్షులు కుమార్ యాదవ్ ను ఆదివారం జగద్గిరిగుట్ట పోలీసులు రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారిక పర్యటన సందర్భంగా ముందస్తుగా అరెస్టు చేసి పోలీస్ స్టేషన్ కు తరలించారు. ఈ సందర్భంగా కుమార్ యాదవ్ మాట్లాడుతూ ఎలాంటి ధర్నా లేదు ముట్టడి లేదు కానీ పొద్దున్నే నిద్రలేవక ముందే ముందస్తు అరెస్ట్ అని చెప్పి జగద్గిరిగుట్ట పోలీస్‌లు ఇంటికి వచ్చి అక్రమంగా అరెస్ట్ చేసి పోలీస్ స్టేషన్‌కు తీసుకురావాడన్ని ఆయన తీవ్రంగా ఖండిస్తున్నానని అన్నారు. అబ్దుల్లాపూర్మెట్‌లో ముఖ్యమంత్రి అధికారిక కార్యక్రమ పర్యటనలో అడ్డుకుంటామన్న భయంతో అరెస్టు చేయడం దుర్మార్గమైన చర్య అన్నారు.

నిరుద్యోగుల సమస్యలను పరిష్కరించాలని కొట్లాడుతున్న నేపథ్యంలో పోలీస్ యంత్రాంగంచే అప్రజాస్వామికంగా అరెస్ట్‌లు చేపించి ఉద్యమాలను అణిచివేయాలనుకోవడం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిది మూరపు చర్య అన్నారు. ప్రజలందరూ కాంగ్రెస్ ప్రభుత్వ దుందుడుకు విధానాలను ఖండించాల్సిన అవసరం ఉంది అన్నారు. నియంతృత్వ నిరంకుశ కాంగ్రెస్ ప్రభుత్వం వైఖరిని మార్చుకొని రాష్ట్రంలో ఉన్న నిరుద్యోగుల సమస్యలను పరిష్కరించాలి అన్నారు. లేకుంటే బీజేవైఎం ఆధ్వర్యంలో ఆందోళన కార్యక్రమాలను తీవ్రతరం చేస్తామన్నారు.







# తెలంగాణలో బోనాలు ఎందుకు తీస్తారు..?

## చారిత్రక పాశస్త్యం ఏంటంటే..?

**హైదరాబాద్,జులై 14(నమస్తే ఉదయం):**
తెలంగాణలో బోనాల పండుగ మస్త్ ఫేమస్.పోతరాజుల నృత్యాలు,శివసత్తుల పూనకాలతో పల్లె నుంచి పట్నం వరకు బోనాల పండుగతో సందడిగా మారుతుంది. ముఖ్యంగా హైదరాబాద్ జంటనగరాల్లో.. బోనాల సందడి అంతా ఇంతా కాదు.బోనాల వేడుకను తెలంగాణ ఆవిర్భావం తర్వాత ప్రభుత్వం రాష్ట్ర పండుగగా నిర్వహిస్తూ వస్తున్నది.ఏటా ఆషాఢ మాసంలో తొలి గురువారం లేదంటే ఆదివారం వేడుకలు ప్రారంభ మవుతుంటాయి. అయితే,బోనాల పండుగకు ఎంతో చారిత్ర పాశస్త్యం ఉన్నది.అజ్ఞాత యుగం నుంచే ఈ బోనాల సంప్రదాయం కొనసాగుతున్నది.కొండ కోనల్లో మనిషి జీవించిన కాలంలో ఒక రాయిని దేవతగా చేసుకుని ప్రకృతి తనకు ఇచ్చిన పత్రి,పువ్వు,కొమ్మ, పసుపు కుంకుమ, నీళ్లు, ధాన్యం, కూరగాయలను సమర్పించాడు. అప్పుడు ప్రారంభమైన ఈ సమర్పణనే బోనాల వరకు వచ్చింది.పూర్వ కాలం నుంచే ఉన్న ఈ బోనాలకు ఒక్కో ప్రాంతంలో ఒక్కో చరిత్ర ఉంది.

### పల్లవరాజు కాలంలోనే..

600ఏళ్ల నాటి పల్లవ రాజుల కాలంలో తెలుగు నేలపై బోనాల పండుగ ప్రాశస్త్యం పొందిందని ప్రతీతి. 15వ శతాబ్దంలో శ్రీకృష్ణ దేవరాలు ఏడు కోళ్ల ఎల్లమ్మ నవదత్తి ఆలయాన్ని నిర్మించి,బోనాలు సమర్పించారట. 1676లో కరీంనగర్ హుస్నాబాద్‌లో ఎల్లమ్మగుడిని సర్వాయి పాపన్న కట్టించి, ఆ దేవతకు బోనాలు సమర్పించినట్టు కైఫీయతుల్లో గౌడనాడులు గ్రంథంలోనూ ఉన్నది.



ఇక హైదరాబాద్ చరిత్రను గమనిస్తే.. 1869లో జంటనగరాల్లో ప్లేగు వ్యాధి మహమ్మారిలా వచ్చి ప్రబలడంతో వేలాది మంది ప్రాణాలు కోల్పోయారు. దైవాగ్రహానికి గురయ్యామని భావించిన అప్పటి ప్రజలు..గ్రామ దేవతలను శాంతపరచడానికి, ప్లేగు వ్యాధి నుంచి తమను తాము కాపాడుకోవడానికి చేపట్టిన క్రతువే ఈ బోనాలు.1675లో గోల్కొండను పాలించిన లబుల్ హసన్ కుతుబ్ షా (తానీషా) కాలంలో బోనం పండుగ హైదరాబాద్‌లో ప్రారంభమైనట్టు కూడా చరిత్రకారులు చెబుతుంటారు.

### బోనం ఎందుకంటే..?

రుతుపవనాలు ప్రవేశించి వర్షాకాలం ప్రారంభంకాగానే మలేరియా, టైఫాయిడ్ తదితర విషజ్వరాలతో పాటు ఇతర సీజనల్ అంటువ్యాధులు ప్రబలుతుంటాయి. ఈ సీజనల్ వ్యాధుల నివారణకు బోనాల పండుగకు సంబంధం ఉన్నది.వేపాకు క్రిమినాశినిగా పనిచేస్తుంది.అందుకే రోగ నిరోధకత కోసమే ఇంటికి వేప తోరణాలు కడుతారు.బోనం కుండకు వేపాకులు కట్టడమే కాకుండా..బోనం ఎత్తుకున్న మహిళలు వేపాకులు పట్టుకుంటారు. పసుపు నీళ్ల చల్లడం కూడా అందుకే మొదలైందని అంటారు. భోజనం ప్రకృతి అయితే..దాని వికృతి పదమే బోనం. అన్నం, పాలు,పెరుగుతో కూడిన బోనాన్ని అమ్మవారి కోసం మట్టి లేక రాగికుండలో వండుతారు. ఆ తర్వాత బోనాల కుండలను వేప రెమ్మలతో, పసుపు, కుంకుమతో అలంకరించి దానిపై ఒక దీపం ఉంచుతుంటారు.ఇలా తయారు చేసిన బోనాలను తలపై పెట్టుకుని డప్పు చప్పుళ్లతో మహిళలు ఆలయానికి తీసుకెళ్తారు.ఈ బోనాల కుండలను ఇలా బోనం నైవేద్యంగా సమర్పించే తంతును ఊరడి అంటారు.గ్రామాల్లో దీన్నే పెద్ద పండుగ,ఊర పండుగ వంటి పేర్లతో పిలుచుకుంటారు.

### ప్రతి ఘట్టమూ ఆవిష్కృతం..

బోనాల జాతర కేవలం అమ్మవారికి నైవేద్యం సమర్పించడంతోనే ముగిసిపోదు.గ్రామీణ సంబురాలకు సంబంధించిన ప్రతి ఘట్టమూ ఇందులో కనిపిస్తుంది.తొట్టెల పేరుతో అమ్మవారికి కర్రలు,కాగితాలతో చేసిన అలంకారాలు సమర్పించడం, రంగం పేరిట భవిష్యవాణి చెప్పే ఆచారమూ ఈ బోనాల పండుగలో ఉంటుంది.అమ్మవారిని ఘటం రూపంలో స్థాపించడం, ఆ ఘట్టాన్ని నిమజ్జనం చేయడాన్ని చూడవచ్చు.పండుగలో జానపద కళలు,డప్పుల చప్పుళ్లు,శివసత్తుల విన్యాసాలతో పండుగ వాతావరణం కనిపిస్తుంది.

---



# కష్టపడిన ప్రతిఒక్కరికి అండగా ఉంటా...

**ప్రభుత్వానికి ప్రజలకు మధ్య వారధిగా పని చేద్దాం...**

**ప్రభుత్వ సంక్షేమ ఫలాలు ప్రజలకు అందేలా కృషి చేస్తా...**

**శేరిలింగంపల్లి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ జగదీశ్వర్ గౌడ్...**

**కూకట్‌పల్లి, జూలై 14 (నమస్తే ఉదయం):**
గత ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీ కోసం కష్టపడిన ప్రతి ఒక్క కార్యకర్తకు అండగా ఉంటానని శేరిలింగంపల్లి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ జగదీశ్వర్ గౌడ్ అన్నారు. ఆదివారం హైదరనగర్ డివిజన్ పరిధిలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలతో శేరిలింగంపల్లి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ జగదీశ్వర్ గౌడ్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో శేరిలింగంపల్లి నియోజకవర్గం అభివృదే ప్రధాన లక్ష్యంగా బడుగు, బలహీన వర్గాల ప్రజలకు సేవ చేయాలనే ఆశయాన్ని బలం చేకూర్చే విధంగా మీ వెంటే నడుస్తూ శేరిలింగంపల్లి నియోజకవర్గ కాంగ్రెస్ కార్యకర్తలకు, నాయకులకు, అభిమానులకు అండగా ఉంటానని తెలిపారు.
ఈ కార్యక్రమంలో నియోజకవర్గ నాయకులు గొట్టిముక్కల వెంకటేశ్వర రావు, కూన సత్యం, డివిజన్ అధ్యక్షులు, యూత్ నాయకులు, కార్యకర్తలు, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

# ధరణి నగర్‌లో సమస్యల పరిష్కారానికి కృషి చేస్తా

**- కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్...**

**కూకట్‌పల్లి, జూలై 14 (నమస్తే ఉదయం):**
అల్విన్ కాలనీ డివిజన్ పరిధిలో ధరణి నగర్‌లో నెలకొన్న సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని స్థానిక కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్ అన్నారు. డివిజన్ పరిధిలోని ధరణి నగర్ లో డ్రైనేజీ, రోడ్లకు సంబంధించి సమస్యలు ఉన్నాయని కాలనీ వాసులు డివిజన్ కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్ దృష్టికి తీసుకురాగా ఆదివారం కార్పొరేటర్ ధరణి నగర్లో పాదయాత్ర చేసి సమస్యలను ప్రజల నుండి అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ వెంకటేష్ గౌడ్ మాట్లాడుతూ... ధరణి నగర్ కాలనీ గతంలో ఎలా ఉండేదో అందరికి తెలిసిన విషయమే, చిన్న వర్షానికి కూడా ముంపుకు గురైయే కాలనీని అభివృద్ధి చేశామని గుర్తుచేశారు. పెండింగులో ఉన్న డ్రైనేజీ, సీసీ రోడ్లను సంబంధిత అధికారులతో మాట్లాడి త్వరలో పనులు పూర్తిచేస్తామని హామీ ఇచ్చారు.
కార్యక్రమంలో సమ్మారెడ్డి, భాస్కర్, అగ్రవాసు, మహీందర్ రెడ్డి, సత్యనారాయణ, ప్రసాద్, వెంకటేశ్వర్లు, ఇస్మాయిల్, రెహమాన్, ప్రేమ్ దాస్ బాలస్వామి సాగర్ తదితరులు పాల్గొన్నారు.



ధరణి కాలనీలో పర్యటిస్తున్న కార్పొరేటర్ వెంకటేష్ గౌడ్

---

# రంగారెడ్డి జిల్లా కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షుడు కోరని బాల్ రాజ్‌ను పరామర్శించిన టిపిసిసి ప్రధాన కార్యదర్శి బొర్రా జ్ఞానేశ్వర్ ముదిరాజ్

**రాజేంద్రనగర్,జులై 14(నమస్తే ఉదయం):**
అనారోగ్యంతో బాధపడుతున్న రంగారెడ్డి జిల్లా కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షుడు కోరని బాల్ రాజ్‌ని టిపిసిసి ప్రధాన కార్యదర్శి బొర్రా జ్ఞానేశ్వర్ ముదిరాజ్ పరామర్శించి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. కోరని బాలరాజ్ గత కొన్ని రోజులుగా అస్వస్థతకు గురై ఇంట్లోనే ఉంటున్నాడు. కోరని బాలరాజును పరామర్శిం చిన వారిలో పిసిసి ఎస్సీ సెల్ ఉపాధ్యక్షులు. జల్ పల్లి నరేందర్,ఏ బ్లాక్ అధ్యక్షులు డప్పు నవీన్ కుమార్, బి బ్లాక్ అధ్యక్షులు ఏండి.ఖలీద్,శంషాబాద్ మున్సిపల్ అధ్యక్షులు పి.సంజయ్ యాదవ్‌లు ఆదివారం పరామర్శిం చారు.
రాజేంద్రనగర్ సర్కిల్ బుద్వేల్ బస్తీలోని కోరని బాల్ రాజ్ నివాస గృహంలో అతని కలిసి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ఈ పరామర్శించిన వారిలో మైలార్ దేవులపల్లి అధ్యక్షులు ఎన్.ధనంజయ,శాస్త్రిపురం డివిజన్ అధ్యక్షులు తాజ్ ఉద్దీన్,సల్మాన్ నగర్ డివిజన్ అధ్యక్షులు ఇస్మాయిల్ తదితరులు పాల్గొన్నారు.



కాంగ్రెస్ పార్టీ రంగారెడ్డి జిల్లా నాయకులు కోరని బాలరాజుని పరామర్శించిన కాంగ్రెస్ నాయకులు

---

# ఉద్యమ నేత కెసిఆర్ నాయకత్వంలోనే కొనసాగుతా: పోరెడ్డి ధర్మారెడ్డి

**రాబోయే కార్పొరేట్ ఎన్నికల్లో సత్తా చాటుదాం..**

**రాజేంద్రనగర్‌లో పార్టీని మరింత బలోపేతం చేస్తాం..**

**రాజేంద్రనగర్ డివిజన్ అధ్యక్షుడు పోరెడ్డి ధర్మారెడ్డి**

**రాజేంద్రనగర్,జులై 14 (నమస్తే ఉదయం):**
ఉద్యమ నేత, మాజీ సీఎం కేసీఆర్, బి ఆర్ ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ నాయకత్వంలోనే కొనసాగుతానని ,తాను పార్టీ మారే ప్రసక్తే లేదని రాజేంద్రనగర్ డివిజన్ బి ఆర్ ఎస్ అధ్యక్షులు పోరెడ్డి ధర్మారెడ్డి అన్నారు. ఆదివారం రాజేంద్రనగర్ సర్కిల్ పరిధిలోని ఉప్పర్‌పల్లిలోని బి ఆర్ ఎస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ధర్మారెడ్డి మాట్లాడుతూ...కేసీఆర్,కేటీర్ నాయకత్వంలోనే తాను పనిచేస్తానని తెలిపారు.
రాష్ట్ర ప్రభుత్వ ప్రజా వ్యతిరేకమైన పాలనపై పోరాటం చేస్తామని వెల్లడించారు.ఉద్యమ కాలం నుంచి బీఆర్ఎస్ పార్టీలో కొనసాగు తున్నానని, అధికారం పోగానే పార్టీ మారడం సమంజసం కాదన్నారు. రాజేంద్రనగర్ బీఆర్ఎస్ ఎమ్మెల్యే టి.ప్రకాష్ గౌడ్ అధికార కాంగ్రెస్ పార్టీలో చేరడంతో ఆయన వెంటే నాయకులు, కార్యకర్తలు వెళ్లారని జరుగుతున్నా ప్రచారాన్ని కొట్టిపారేశారు. కెసిఆర్, కేటీఆర్ అండదండలతో ప్రజాసేవ కోసం నిరంతరం కష్టపడతానన్నారు.రాజకీయాల్లో ఎవరి ఇష్టం వారిది తాను మాత్రం బీఆర్ఎస్‌లోనే కొనసాగుతానని వెల్లడించారు.ప్రభుత్వం ప్రజా వ్యతిరేకమైన పాలనపై పోరాటం చేస్తామని తెలిపారు. ప్రజాపాలన అందిస్తున్న కేసీఆర్ ను పక్కన పెట్టి కాంగ్రెస్ పార్టీకి పట్టం కట్టిన ప్రజలు కాంగ్రెస్ పార్టీని ఎందుకు గెలిపించామా అన్న ఆలోచనలో ఉన్నారని తెలిపారు.సీఎం కేసీఆర్ నాయకత్వంలో అభివృద్ధి, సంక్షేమంలో తెలంగాణ రాష్ట్రం నెంబర్ వన్‌గా నిలిచిందన్నారు.
రాజేంద్రనగర్ సర్కిల్ పరిధిలో బీఆర్ఎస్ పార్టీని మరింత బలోపేతం చేసేందుకు నాయకులు కార్యకర్తలను కలుపుకొనిపోయి రానున్న జిహెచ్ఎంసి ఎన్నికలలో విజయం సాధిస్తామన్నారు. రాష్ట్రంలో మళ్లీ గెలిచేది బీఆర్ఎస్ పార్టీ అని గుర్తు చేశారు.



---

# రాజకీయాలకు అతీతంగా ఆలయ అభివృద్ధిలో అందరి పాత్ర ఉండాలి:వడ్డేపల్లి రాజేశ్వరరావు

**కూకట్‌పల్లి, జూలై 14 (నమస్తే ఉదయం):**
ఫతేనగర్ డివిజన్ పరిధిలోని దీన్ దయాల్ నగర్ శివాలయం, పంచముఖి హనుమాన్ ఆలయాన్ని అభివృద్ధి చేసే దిశగా జరిగినటువంటి సమావేశంలో కమిటీ సభ్యుల ఆహ్వానం మేరకు బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వడ్డేపల్లి రాజేశ్వరరావు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.
ఈ సందర్భంగా వడ్డేపల్లి రాజేశ్వరరావు మాట్లాడుతూ ఆలయ అభివృద్ధి విషయంలో భిన్న అభిప్రాయాలు ఉన్నటువంటి స్థానిక నాయకులందరితో మాట్లాడి ఆలయాన్ని అందరం కలిసి ఐక్యమత్యంతో అభివృద్ధి చేసుకోవాలని, రాజకీయా లకు అతీతంగా ఆలయ అభివృద్ధిలో అందరి పాత్ర ఉండాలని అన్నారు. ముందుగా కపిల్ గుప్త విజయ దేవి దంపతులు దాతగా వచ్చినందుకు వారికి ధన్యవాదాలు తెలియజేస్తున్నానని అన్నారు. అదేవిధంగా మరికొందరు దాతలు ముందుకు రావాలని, దేవాలయ అభివృద్ధికై నా వంతు సహాయం నేనుకూడ చేస్తానని వడ్డేపల్లి రాజేశ్వరరావు సమావేశంలో తెలియజేశారు.
ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు కంచి మహేందర్, బురుగుపల్లి రామ్మోహన్, బస్తీ అధ్యక్షులు కాసుల మహేందర్, ప్రధాన కార్యదర్శి హరి ప్రసాద్, సభ్యులు సతీష్, సాయిలు, నాగేష్, సుదర్శన్, శ్రీనివాస్, గిరి తదితరులు పాల్గొన్నారు.



**Printed and Published MEKALA DAMODAR REDDY** on behalf of VANITHA Publications, and Printed at Vanitha Graphics, Maruthi Enclave, Attapur, Rajendra Nagar, Ranga Reddy,Telangana-500048. and Published at: H.No. 6-2-4/2, 1st Floor, Shivarampally , NPA, Rajendra Nagar, Ranga Reddy Telangana-500052. **Editor: M.Damodhar Reddy. "RNI. Title- Code: TELTEL/2023/87699**. Cell: 9492148733